ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
కడప జిల్లా వార్తలు
5
సోమవారం 23 సెప్టెంబరు 2024



# కోరిన చోటుకే పెన్షన్



- పింఛనుదారులకు వెసులుబాటు
- ఆన్‌లైన్ ద్వారా బదిలీకి అవకాశం కల్పించిన ప్రభుత్వం
- ప్రతి నెలా 15లోగా దరఖాస్తు చేసుకోవాలి
- తొలగనున్న పింఛనుదారుల ఇబ్బందులు

పులివెందుల టౌన్, సెప్టెంబరు 22: రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద లబ్ధి పొందుతున్న వారు ఇక నుంచి కోరిన చోటనే పెన్షన్ తీసుకునే వెసలుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించింది. జిల్లాలోని ఇతర మండలాలకు కానీ, రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు కానీ మార్చుకుని అక్కడే తీసుకోవచ్చు. రాష్ట్రంలోని చాలా మంది పెన్షన్‌దారులు సొంత ఊర్లకు దూరంగా ఉంటున్నారు. ప్రధానంగా వృద్ధులు తమ పిల్లల వద్ద ఉంటున్నారు. ప్రతి నెలా సొంతూరుకు వచ్చి సొమ్ము తీసుకోవాల్సి రావడంతో వీరు ఇబ్బంది పడుతున్నారు. కొంతమంది దూరం నుంచి రాలేక ఒక్కోనెల పెన్షన్ తీసుకోలేక పోతున్నారు. దీంతో ఇప్పటి వరకు 99 శాతం వరకే పెన్షన్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. నూటికి నూరు శాతం పంపిణీ కావాలంటే లబ్ధిదారులు ఎక్కడ నివాసం ఉంటున్నా అక్కడే పెన్షన్ అందుకునేలా చర్యలు చేపట్టింది. ఈ సౌకర్యం పొందాలంటే ప్రతి నెలా 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. లబ్ధిదారులు ముందుగా తాము పెన్షన్ పొందుతున్న సచివాలయాన్ని సంప్రదించి అక్కడ నుంచి ఎక్కడికి పెన్షన్ మార్చుకోవాలనుకుంటున్నారో ఆ వివరాలను తెలియజేయాలి. బదిలీ కోరుకునే గ్రామ సచివాలయం పేరు నమోదు చేయాలి. ఆధార్ జిరాక్స్ కాపీ పెన్షన్ ఐడీ చూపించాలి. పెన్షన్ బదిలీ మండల పరిధిలో అయితే వెంటనే జరిగిపోతుంది. అదే ఇతర జిల్లాలకు అయితే జిల్లా వెలుగు, డీఆర్‌డీఏ, పీడీల లాగిన్ నుంచి అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. వారు అనుమతి ఇవ్వగానే లబ్ధిదారులు కోరుకున్న చోటుకు మారి పోతుంది. తర్వాత అక్కడే పింఛను తీసుకోవచ్చు. కాగా జిల్లాలో ప్రస్తుతం 2,63,283 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరికి పెన్షన్లు అందించేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రతి నెలా రూ.112.22 కోట్ల నిధులు విడుదల చేస్తోంది. వీరిలో అనేక మంది లబ్ధిదారులు ఇతర చోట్ల నివాసం ఉంటూ పెన్షన్ సొమ్ము కోసమే సొంతూర్లకు వస్తున్నారు. ఇలాంటి వారికి పెన్షన్లు మార్చుకునే వెసులుబాటు రావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 22: స్థానిక కలెక్టరేట్‌లో ఈనెల 23న జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలు, ప్రగతిని జిల్లా ప్రజలకు తెలియజేసేందుకు.. ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర ప్రదేశ్ విజన్-2047 కార్యక్రమాల్లో భాగంగా జిల్లా అంతటా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అధికారులందరూ ఈ కార్యక్రమంలో నిమగ్నమైనందున ఈ నిర్ణయం తీసుకోవడం జరిగిందని కలెక్టర్ ప్రకటనలో పేర్కొన్నారు.

## జడ్పీ సీఈవోగా ఓబులమ్మ

- డిప్యూటీ సీఈవోగా మైథిలీ
- డీపీవోగా రాజేశ్వరి
- ప్రస్తుత సీఈవో సుధాకర్‌రెడ్డి అనంతపురం డీఎల్‌డీవోగా బదిలీ
- ప్రస్తుత డీపీవో ప్రభాకర్‌రెడ్డి అదోని డీఎల్‌డీవోగా బదిలీ


ఓబులమ్మ

కడప(రూరల్), సెప్టెంబర్ 22: ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆది వారం పలు జిల్లాల సీఈవో, డిప్యూటీ సీఈవో, డీఎల్‌డీవోలకు బదిలీలు, పోస్టింగ్‌లను కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసి.. తక్షణమే అమలులోకి తేవాలని ఆదేశించింది. ఈ మేర కు అనంతపురం జిల్లాలో డీఎల్‌డీవోగా పనిచేస్తున్న సి.ఓబులమ్మను వైఎస్ఆర్ కడప జిల్లా జడ్పీ సీఈవోగా నియమించారు. అలాగే డీఎల్‌డీవో హోదాలో జిల్లా డ్వామాశాఖలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి.మైథిలిని కడప జడ్పీ డిప్యూటీ సీఈవోగా నియమించారు. ప్రస్తుతం జడ్పీ సీఈవోగా పనిచేస్తున్న ఎం.సుధాకర్‌రెడ్డిని పుట్టపర్తి జిల్లాకు డీఎల్‌డీవోగా, అలాగే ప్రస్తుత జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న రమణారెడ్డిని ప్రభుత్వానికి రిపోర్టు చేసుకోవాలని ఆదేశించారు. అలాగే కడప డీఎల్‌డీవోగా పనిచేస్తున్న వెంకటసుబ్బయ్యకు అనంతపురం జిల్లా జడ్పీ డిప్యూటీ సీఈవోగా పోస్టింగ్‌ను ఇచ్చారు. అలాగే జిల్లా పంచాయతీశాఖ జిల్లా అధికారి(డీపీవో)గా ఏపీ ఎస్ఐఆర్‌డీలో డీపీవోగా పనిచేస్తున్న రాజేశ్వరిని నియమించారు. ప్రస్తుత డీపీవోగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని కర్నూల్ జిల్లా అదోని డీఎల్‌డీవోగా బదిలీ చేశారు.

# పారా హుషార్..

వరుస దొంగతనాలు జిల్లా వాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎప్పుడు ఎక్కడ చోరీలు జరుగుతాయోనన్న భయంతో వణికిపోతున్నారు. గతంలో టీడీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా భారీ సంఖ్యలో సీసీ కెమెరాలు ఉండేవి. నేరం జరిగినా.. అనుమానిత వ్యక్తులు ప్రవేశించినా ఇట్టే కనిపెట్టేవారు. అయితే జగన్ పాలనలో సీసీ కెమె రాలను అటకెక్కించారు. వాటి నిర్వహణే గాలికొదిలేశారు. వెరశి నిఘా నేత్రం మూసుకు పోయింది. ఇప్పుడు చోరీలకు నిలయంగా మారి కలకం రేపుతోంది.


కడపలో ఏటీయం దొంగతనాలు



- వరుస చోరీలతో భయం భయం
- నిన్న ఇళ్లు.. దుకాణాల్లో చోరీ
- నేడు ఏటీయంలను కొల్లగొట్టిన దుండగులు
- రూ.42లక్షలు అపహరణ


దుండగులు కొల్లగొట్టిన ఏటీఎం

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల వరుస దొంగతనాలు జనం కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల కడప, పులివెందులలో ఇళ్లు, దుకాణాల్లో వరుస దొంగతనాలు కల కలం రేపాయి. ఎస్పీ అప్రమత్తమై పోలీసులను అలర్ట్ చేసి గస్తీ పెంచారు. అయితే మళ్లీ ఒకే రోజు జిల్లాలో ఒంటిమిట్ట, కడపలో ఏటీఎంలలో దొంగతనానికి పాల్పడి రూ.42 లక్ష లకు పైగా దోచుకెళ్లారు. మరో ఏటీయంను దోచుకునేందుకు ప్రయత్నించగా అలర్ట్‌తో సైడ్ అయిపోయారు. ఇక పులివెందులలో ఓ ఇంట్లో పెద్దఎత్తున బంగారు, వెండి నగలతో పాటు నగదు చోరీ చేశారు. ఒకే రోజు అటు ఇల్లు, ఇటు ఏటీయంలలో దోపిడీకి పాల్ప డటం పోలీసులకు సవాల్‌గా మారింది. ఓ విధంగా చెప్పాలంటే... నిఘా వ్యవస్థను ప్రశ్నిస్తోంది. ఇది పోలీసు వ్యవస్థకు మచ్చలాంటిదే.

### ఏటీయంలలో దొంగతనంతో..

ఇటీవల కాలంలో జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్నాయి. అయితే ఒకేరోజు జిల్లా కేంద్రమైన కడపతో పాటు ఒంటిమిట్టలో ఏటీయంలలో నగదు దోచుకెళ్లడం, పులివెందుల లో ఇంట్లో బంగారు, వెండి నగలతో పాటు నగదు చోరీ చేయడం సంచలనంగా మారింది. కడప నగరంలో శనివారం అర్ధరాత్రి అంటే 12.40 నిమిషాలకు అటు తెల్లారితే ఆదివారం.. ఆర్టీసీ బస్టాండు నుంచి కలెక్టరేట్ పోయే దారిలో ఉన్న విశ్వేశ్వరయ్య సర్కిల్ వద్ద ఉన్న ఏటీయం మిషన్‌లో దొంగలు దొంగతనానికి ప్రయత్నించారు. అయితే ఏటీయం సైరన్ మోగడంతో దొంగలు కడపలో పలుసార్లు చక్కర్లు కొట్టి.. ఆతర్వాత ద్వారకనగర్‌లోని ఎస్‌బీఐ ఏటీయం మిషన్‌లోకి వెళ్లి 2 నుంచి 3 గంటల మధ్యలో గ్యాస్ కట్టర్‌తో ఏటీ యంను కట్ చేసి రూ.6,19,700ల నగదు చోరీ చేశారు. అక్కడి నుంచి వెళ్లి ఆదివారం తెల్ల వారుజామున 3.40కి ఒంటిమిట్టలో ఉన్న ఎస్‌బీఐ ఏటీయం మిషన్‌ను కట్ చేసి రూ.36,19,400ను కొట్టేశారు. ఇక్కడ పోలీసుస్టేషన్ పక్కలోనే దొంగలు ఏటీయంలో చోరీకి పాల్పడటం గమనార్హం. అలాగే కడపలో ద్వారకానగర్‌లో తాలుకా పోలీసుస్టేషన్ సమీ పంలోనే ఉంటుంది. కూతవేటు దూరంలోనే ట్రాఫిక్ పోలీసుస్టేషన్ ఉంటుంది. ఈ ఏటీయం ఉన్న ప్రాంతం ఆసుపత్రి ఏరియా. తిరుపతి నుంచి హైదారబాదు వెళ్లే ఆర్టీసీ బస్సులు హైదరాబాదు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఇదే దారిలో నడుస్తుంటాయి. వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అయితే ఇక్కడ చోరీ జరగడం గమనార్హం. రైతు బజారు కోసం పక్కనే కూరగాయలకు వస్తుంటారు. జనం అలికిడి ఉంటుంది. అయితే ఇలాంటి చోటనే నిర్భయంగా దొంగలు ఏటీయం కొల్లగొట్టి సవాల్ చేశారు. కాగా, దొంగలు చాలా పకడబ్బందీగా పూర్తిస్థాయిలో దుస్తులు, ముఖానికి మాస్కులు ధరించి చోరీలకు పాల్పడుతున్నారు. ఏటీయంలో ఉన్న సీసీ కెమెరాల కంటపడకుండా వాటిపై స్ప్రే చేసి తమ హస్తలాఘవం ప్రదర్శించారు.

### వరస చోరీలో కలవరం

జిల్లాలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపధ్యంలో జిల్లాలో జరిగిన చోరీలను పరిశీలిస్తే...

- ఆగస్టు 3న కడపలోని ప్రకాశ్‌నగర్‌లో దొంగలు పడి పది తులాల బంగారు నగలు, రూ.4 లక్షల నగదు అపహరించారు.
- ఆగస్టు 19న కడప తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో విజయదుర్గాకాలనీలో ఓ ఇంట్లో దొంగలు కేజీ వెండితో పాటు 3 తులాల బంగారం, 30వేలు నగదు తీసుకెళ్లారు. అదే రోజు విజయదుర్గాకాలనీలో కొంతమంది దొంగలు ఆ ప్రాంతంలో తిరుగుతున్నట్లు సీసీ కెమె రాకు చిక్కారు. వీరంతా చెడ్డీ గ్యాంగ్‌గా అనుమానించారు.
- జూన్ 21న ఖాజీపేటలో రూ.44 లక్షల నగదు, బంగారు కాజేశారు.
- జూన్ 17న పులివెందులలో ఓ ఇంటిలో 26 తులాల బంగారు, 40వేలు నగదు దోచుకెళ్లారు. అదే రోజు కడపలో సీఎస్ పురంలో 9 తులాల బంగారం చోరీ చేశారు. రాజారెడ్డివీధిలో పగలే దొంగతనం చేశారు.

### పులివెందులలో హల్‌చల్

పులివెందులలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువయ్యాయి. ఆదివారం పులివెందులకు చెందిన హరినాథరెడ్డి హెచ్‌పీ గ్యాస్ డీలరు. ఈయన విజయహోంలోని ప్లాటు నెం.149లో నివాసం ఉంటున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో బెంగుళూరు వెళ్లడంతో.. పక్కాగా ప్లాన్ వేసిన దొంగలు ఇంట్లోకి వెళ్లి 750 గ్రాముల బంగారం, 2 లక్షలు విలువ చేసే వెండి, లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. ఈవిషయం తెలిసి ఆంధ్రజ్యోతి రిపోర్టర్ అక్కడ ఫొటోలు తీసేందుకు వెళ్లగా పోలీసులు ఆ రిపోర్టరుపై దురుసుగా వ్యవహరించారు. ఫొటోలు తీయవద్దన్నారు. పులివెందులలో ఇటీవల దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయంటే.. మా డ్యూటీ నీవు చేద్దువురా, గుడ్డుకు ఏం తెలుసు కోడి బాధ అని వ్యంగ్యంగా చెప్పుకొచ్చారు. దొంగతనాలు జరుగుతన్నాయి సార్ అంటే మేమొచ్చి నెల అయ్యిందంటూ సీఐ, అటు పోలీసులు నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడం గమనార్హం. ఇటీవల జరిగిన చోరీలను పరిశీలిస్తే..

- ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్న శ్రీరామ్‌చిట్స్ మేనేజరు ఇంట్లో చోరీ చేసి సుమారు 18 తులాల బంగారు, లక్ష రూపాయల వెండి, ఇతర వస్తువులు పట్టుకెళ్లారు.
- షాదికాన్ సమీపంలో నివాసం ఉంటున్న మావూరి సినిమా హీరో మహేశ్ ఇంట్లో రూ.10లక్షలు నగదు, బంగారు నగలు చోరీ చేశారు.
- పులివెందుల కోతి సమాధి వద్ద నివాసం ఉటున్న కళాయమ్మ ఇంట్లో 18 తులాల బంగారు, అరకేజీ వెండి, రూ.70వేలు నగదు దోచుకెళ్లారు.అలాగే గాయత్రినగర్‌లో నివాసం ఉంటున్న మహేశ్వర్‌రెడ్డి ఇంట్లో 10 తులాల బంగారం, 4 లక్షల క్యాష్ దోపిడీ చేశారు. శ్రీరామ్‌హాలు రహదారిలో జీవీకే సూపర్ మార్కెట్లో రూ.50వేలు దొంగలించారు. హోంగార్డు ఇంట్లో దొంగతనం చేసి నాలుగు తులాల బంగారం తీసుకెళ్లారు. ఇవన్నీ పది రోజుల వ్యవధిలోనే జరగడం గమనార్హం.


ఒంటిమిట్టలోని ఏటీఎంను ధ్వంసం చేసిన దుండగులు

# వైసీపీలో ముసలం

- టీడీపీ గూటికి 25వ వార్డు కౌన్సిలర్



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ రాష్ట్రవ్యాప్తంగా ట్రబుల్‌లో ఉంది. ముఖ్య నేతలంతా పార్టీని వీడుతున్నారు. ఇదే సమయంలో తిరుపతి లడ్డూవివాదం వైసీపీలో కలవరం రేపుతోంది. ఈ టైంలో మాజీ సీఎం వైఎస్ జగన్ సొంత జిల్లాలో ముసలం పుడుతోంది. వైసీపీకి చెందిన 25వ డివిజను కార్పోరేటరు సిటికేబుల్ సూర్యనారాయణ ఫ్యానుకు బైబై చెప్పి నేడు సైకిల్ ఎక్కనున్నారు. ఇప్పుడీ వ్యవహారం వైసీపీలో హాట్ టాపిక్‌గా మారింది. సూర్యనారాయణ కుటుంబం ఆది నుంచి వైఎస్ కుటుంబం వెంట ఉండేది. కేబుల్ నెట్‌వర్క్‌లో కీ రోల్‌గా ఉంటుంది. ఆర్యవైశ్య సమావేశంలో సూర్య నారా యణ డిప్యూటీ మేయరు పదవిని ఆశిస్తూ వస్తున్నారు. కడప కార్పొరేషన్‌లో గత పదేళ్లుగా వైసీపీ పాలకవర్గం ఉంది. డిప్యూటీ మేయరు పదవిపై సూర్యనారాయణ ఆశలు పెట్టుకున్నారు. జగన్ వైసీపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో సూర్యనారాయణకు డిప్యూటీ మేయరు పదవి వస్తుందని ఆశించారు. అయితే నిత్యానందరెడ్డి, ముస్లింలకు కేటాయించారు. దీనిపై సూర్యనారాయణ కినుక వహించారు. పార్టీ కోసం కష్టపడితే గుర్తింపు లేదనే ఆవే దన ఉంది. రెండు రోజుల క్రితం జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాధరెడ్డి కడప కార్పొరేటర్లతో సమావేశం జరపగా సూర్యనారాయణ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపధ్యంలో గుర్తింపు రాని పార్టీలో ఉండేకన్నా పార్టీ మారాలని డిసైడ్ అయి నేడు ఎమ్మెల్యే మాధవీ సమక్షంలో తన అనుచరులతో సైకిలెక్కనున్నారు.

# ఇది మా ప్రభుత్వం.. మేం చెప్పిందే జరగాలి

- క్యాంటీన్‌లను ఖాళీ చేయాల్సిందే..
- ట్రిపుల్‌ఐటీలో టీడీపీ నాయకుల హల్‌చల్



కడప, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వం వచ్చింది... ఇప్పటి వరకు క్యాంటీన్‌లను నడిపింది చాలు... ఖాళీ చేసి వెళ్లండి.. ఇక మేమే వీటిని నడుపుకుంటాం.. మీకు ఎటువంటి సంబంధం లేదంటూ టీడీపీ నాయకులు ట్రిపుల్ ఐటీలో హల్‌చల్ చేశారు. ఇప్పటి వరకు క్యాంటీన్‌లు, సూపర్‌మార్కెట్‌లు నడుపుతున్న నిర్వాహకులపై టీడీపీ నాయకులు అధికార దర్పం ప్రదర్శించారు. వివరాల్లోకెళితే...

ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో శనివారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో వేంపల్లెకు చెందిన ఓ టీడీపీ నాయకుడు, కుమ్మరాంపల్లె, వీరన్నగట్టుపల్లె, ఇడుపులపాయ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులంతా కలిసి రెండు వాహనాల్లో సుమారు 15 మంది దాకా ఒకేసారి వెళ్లి క్యాంపస్‌లో హల్‌చల్ చేశారు. మూడు క్యాంటీన్లు, రెండు సూపర్‌మార్కెట్ల వద్దకు వెళ్లారు. ఇప్పటి వరకు నిర్వహించుకున్నది చాలు.. మా ప్రభుత్వం వచ్చింది.. మాకు కావాలంటూ అక్కడి యజమానులపై నోటిదురుసు చూపారు. ఓ క్యాంటీన్‌లో టీ కూడా తాగి వచ్చారు. ట్రిపుల్‌ఐటీ అధికారుల అనుమతి లేకుండా క్యాంపస్‌లో క్యాంటీన్‌లకు, సూపర్‌మార్కెట్‌లకు వెళ్లడంతో విమర్శలు వెల్లువెత్తాయి.

వేంపల్లె మండలాన్ని పర్యవేక్షిస్తున్న నాయకుడే వెళ్లమని చెప్పినట్లు క్యాంటీన్‌ను, సూపర్‌మార్కెట్‌ల వద్దకు వెళ్లివచ్చిన టీడీపీ నాయకులు చెప్పినట్లు సమాచారం. ఎప్పటి నుంచో వైసీపీకి చెందిన వారే క్యాంటీన్‌లు, సూపర్ మార్కెట్లు నిర్వహించుకుంటున్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక మాకు కావాలంటూ.. వాటిని పరిశీలించేందుకు వెళ్లినట్లు టీడీపీ వర్గాలు చెప్పుకుంటున్నాయి. కాగా ఇవే క్యాంటీన్ల విషయంపై ఖాళీ చేయాలని ట్రిపుల్‌ఐటీ అధికారులు ఇప్పటికే నోటీసు ఇచ్చినట్లు తెలిసింది. ఏది ఏమైనా టీడీపీ నాయకులు క్యాంపస్ ఆవరణలోకి వెళ్లి హల్‌చల్ సృష్టించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో ఆ ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు ట్రిపుల్‌ఐటీలో పనిచేసే బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే విధుల నుంచి తప్పుకోవాలని హుకుం జారీ చేశారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో వైసీపీ నాయకులు వెనక్కి తగ్గారు. కానీ ఇపుడు టీడీపీ వారు వారి అధికార దర్పాన్ని ప్రదర్శించడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి బంధువు అయిన ఓ నాయకుడు అంతా మా కనుసన్నల్లోనే సాగాలనే దృక్పథంతో ప్రతి విషయంలోనూ వివాదానికి తెరలేపారు. భౌతికదాడులకు దిగడానికి సైతం వెనుకాడకపోవడమే ఈ నాయకుడి దృక్పథంగా మారింది. నియోజకవర్గ ఇన్‌చార్జి బంధువు అయితే మాత్రం ఇలాంటి ఆగడాలకు తెరలేపడం ఏమిటని కొందరు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికే పులివెందుల ప్రాంతంలో బైరెటీస్, మద్యం దుకాణాలపై నెలకొన్న విషయాలపై కొందరిని టీడీపీ అధిష్టానం మందలించినట్లు సమాచారం. ఇదిలాగే కొనసాగితే చర్యలుతప్పవని ఘాటైన హెచ్చరికలు చేసినట్లు తెలిసింది. అయినా మాకెవరు అడ్డు అనే తరహాలో వెళ్లడం అందరిని ఆశ్చర్యపరుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటు అయినపుడు ఆ పార్టీకిచెందిన నాయకులు మా పెత్తనం సాగాలనుకోవడం సర్వసాధారణం. కానీ ప్రభుత్వ నిబంధనల మేరకు ఏదైనా పాటిస్తే తప్పులేదు కానీ ఇలా ట్రిపుల్ ఐటీకి వెళ్లి హల్‌చల్ చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏది ఏమైనా ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోవడం పులివెందుల ప్రాంత టీడీపీకి చెడ్డపేరుగా పరిగణించవచ్చు.

# ఫ్లైఓవర్ కలేనా ?

- రైల్వేగేటు సమస్య తీరేది ఎప్పుడో
- సమయానికి వెళ్లలేక ఉద్యోగులు, విద్యార్థుల అవస్థలు
- అత్యవసర చికిత్స సమయంలోనూ అవస్థలు
- ఇబ్బందులు పడుతున్న కమలాపురం ప్రజలు


గేటు వేయడంతో నిలిచిపోయిన వాహనదారులు

కమలాపురం పట్టణ ప్రజలు ఎన్నోసంవత్సరాలుగా రైల్వేగేటుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల సంఖ్య పెరగడం, రైళ్ల రాకపోకలూ ఎక్కువ కావడంతో రోజురోజూ రైల్వేగేటు సమస్య తీవ్రమవుతోంది. మారుమూల ప్రాంతాల్లో సైతం రైల్వే బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు తిరుగుతున్నా కమలాపురం రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ నిర్మించడం లేదు.

కమలాపురం రూరల్, సెప్టెంబరు 22: కమలాపురం మీదుగా ఎర్రగుంట్ల, ముద్దనూరు నుంచి తాడిపత్రికి వెళతుంటారు. ఇక ఖాజీపేట నుంచి కమలాపురం మీదుగా కర్నూలు, హైదరాబాదు ప్రాంతాలకు కూడా వాహనదారులు వెళతుంటారు. ఈ మార్గంలో వెళ్లడం ద్వారా 80 కి.మీ దూరం తగ్గుతుంది. ఇందులో భాగంగా కమలాపురం, ఖాజీపేట రహదారిని కూడా విస్తరించారు. అయితే రైల్వే గేటు సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు.

### ఆఫీసులకు వెళ్లాలన్నా ఆలస్యమే..

వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగస్తులు, ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు పట్టణానికి రావాలంటే రైల్వేగేటు దాటే రావాలి. అత్యవసర సమయంలో గేటు పడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కువసార్లు గేటు వేయడం వల్ల అత్యవసర వైద్యచికిత్సలకు వెళ్లేవారి పరిస్థితి దయనీయంగా ఉంది. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఈ గేటు మరింత సమస్యగా మారుతోంది. ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే చాలామంది ఉద్యోగస్తులు గేటు సమస్య వల్ల సమయానికి వెళ్లలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైళ్ల క్రాసింగ్ ఉంటే..

కమలాపురం పట్టణ ప్రజలు కడప, ప్రొద్దుటూరు ప్రాంతాలకు తప్పనిసరిగా ఈ గేటు మార్గంలోనే వెళ్లాలి. గతంలో రైళ్ల రాకపోకలు చాలా తక్కువగా ఉండేవి. అప్పుడు వాహన రద్దీ కూడా తక్కువగానే ఉండేది. ఇప్పుడు వాహనాల రద్దీ పెరిగింది. రైళ్ల రాకపోకలూ పెరిగాయి. ప్రతి 10, 20 నిమిషాలకోసారి గేటు వేస్తుంటారు. ఒక్కోసారి రైళ్ల క్రాసింగ్ పెడుతుంటారు. ఆ సమయంలో గేటుకు అటు ఇటు గంటల తరబడి వాహనదారులు వాహనాలు నిలిపి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ఫ్లై ఓవర్ త్వరగా నిర్మించాలి..



పట్టణానికి మధ్యలో రైల్వే గేటు ఉండడంతో సమస్య జఠిలంగా మారింది. పట్టణంలో ప్రధాన సమస్యగా మారడంతో ఫ్లై ఓవర్ త్వరగా నిర్మించాలి. ప్రజాప్రతినిధులు అధికారులు ఈ సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలి.

\- జి.నాగేశ్వర్‌రావు,
సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి

### కూటమి ప్రభుత్వమైనా స్పందించేనా..

ఎన్నికల సమయంలో మాత్రం అందరు నాయకులకూ రైల్వేగేటు సమస్య గుర్తుకు వస్తుంది. అప్పుడు మాత్రం నాయకులు ఫ్లై ఓవర్ నిర్మించి తీరుతామని హామీ ఇస్తారు. ఎన్నికలు అయిపోయాక పట్టించుకోవడం మానేస్తారు. ఎన్నో ఏళ్లుగా ఇదే తంతు సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఫ్లైఓవర్ నిర్మాణానికి కృషి చేసి రైల్వేగేటు సమస్య లేకుండా చేయాలని కమలాపురం ప్రజలతో పాటు ఈ మార్గంలో వెళ్లే వాహనదారులు కోరుతున్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం అయినా రైల్వే గేటు సమస్య పరిష్కారానికి మార్గం చూపుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నారు.



# స్వచ్ఛత మన నుంచే మొదలవ్వాలి

- ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు ఎస్.కిశోర్‌కుమార్‌రెడ్డి

కడప (ఎన్టీఆర్ సర్కిల్), సెప్టెంబరు 22: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్, స్వచ్ఛత అనేది మన నుంచే మొదలవ్వాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు ఎస్.కిశోర్‌కుమార్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం కడప భారతీయ స్టేట్‌బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ 2024 భాగంలో ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ 1వ గాంధీ బొమ్మ నుంచి ఆర్ట్సుకళాశాల మైదానం వరకు సాగింది. ఏడురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా రీజనల్ మేనేజరు మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి సూచనల మేరకు స్వచ్ఛతాహి సేవ-2024 కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై స్వచ్ఛభారత్‌గా తీర్చిదిద్దుతామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం జనార్థన్, ఎస్‌బీఐ సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభించిన ఎస్‌బీఐ ఆర్ఎం

## ప్రొఫెసర్ నరసింహారెడ్డి కన్నుమూత

### పరిశోధనార్థం రిమ్స్‌కు దేహదానం




ప్రొఫెసర్ పూడూరి నరసింహారెడ్డి దేహాన్ని అందిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు సెప్టెంబరు 22: విశ్రాంత అగ్రికల్చర్ సైంటిస్ట్ డాక్టర్ పూడూరి నరసింహారెడ్డి (86) ఆదివారం కన్నుమూశారు. ఆయన కోరిక మేరకు శరీరాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనార్థం కడప రిమ్స్‌కు కుటుంబ సభ్యులు అప్పగించారు. వివరాల్లోకెళితే...

రాజుపాళెం మండలం వెంగళాయపల్లె వాసి పూడూరి నరసింహారెడ్డి తిరుపతి అగ్రికల్చర్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా పనిచేశారు. కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో శాస్త్రవేత్తగా కూడా ఆయన సేవలందించారు. వేరు శనగలో వేమన అనే వంగడాన్ని అభివృద్ధి చేయడంలో శాస్త్రవేత్తల బృందానికి నాయకత్వం వహించారు. ఉద్యోగ విరమణానంతరం ప్రొద్దుటూరులోని హౌసింగ్ బోర్డులో స్థిరపడ్డారు. ఆయన ఆదివారం తెల్లవారు ఝామున కన్నుమూశారు. మరణానంతరం తన శరీరాన్ని పరిశోధనార్థం అప్పగించాలని కోరికపై ఆయన తమ్ముని కుమార్తె విప్లవ రచయితల సంఘం మాజీ కార్యదర్శి పూడూరి వరలక్ష్మీ, ఆయన భార్య లీలావతి అనుమతితో రిమ్స్ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఆయన తమ్ముడు పూడూరు నరసింహారెడ్డి దేహం కూడా రెండేళ్ల కిందట కడప రిమ్స్‌కు అప్పగించడం విశేషం. జిల్లా సీపీఐ కార్యదర్శి గాలి చంద్ర మాట్లాడుతూ ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దేహదానం చేయడం అరుదైన విషయమన్నారు. డాక్టర్ ఓబులరెడ్డి, డాక్టర్ మల్లెల భాస్కర్, పల్లవోలు రమణ, సృజన శ్రీనివాసులరెడ్డి, నాగార్జున రెడ్డి, ఏఐఎస్ఎఫ్ వలరాజు, ప్రతాప్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి, శివరాం, అనాటమి డిపార్ట్ మెంట్ హెడ్ డాక్టర్ శారద పాల్గొన్నారు.

## ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి

### - రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్




సమావేశంలో మాట్లాడుతున్న రూటా రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: ప్రభుత్వ సహకారంతో ఉర్దూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేషన్ (రూటా)రాష్ట్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అయూబ్ తెలిపారు. అన్నమయ్య జిల్లా కేంద్రంలోని రూటా జిల్లా కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సిబాతుర్ రెహమాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 1997లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి ఉర్దూ విద్యా వ్యవస్థకు ఊపిరి పోశారన్నారు. 2024లో ఉర్దూ స్పెషల్ డీఎస్సీ నిర్వహించి రాష్ట్రంలోని ప్రతి ఉర్దూ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఖాళీ టీచర్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. 2001లో చంద్రబాబు రోష్ని పథకం ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించి ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలకు రెండు సెకండరీ గ్రేడ్ టీచర్ల పోస్టులు మంజూరు చేసి ఉర్దూ పాఠశాలల మనుగడకు పునాది వేశారని చెప్పారు. రోష్ని పథకం పునఃప్రారంభించి ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు స్థాపించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి అసదుల్లాబాషా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉర్దూ అంగన్వాడీ కేంద్రాలు స్థాపించాలని, మైనార్టీ పసిపిల్లలకు మాతృభాషలో చదివే భాగ్యం కల్పించి ఉర్దూ నిరుద్యోగ యువతకు అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లుగా ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు హుమయుద్దీన్, ఇంరోజ్‌అలీఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## వంద రోజుల్లో మంచి ప్రభుత్వంగా గుర్తింపు

### ● నియోజకవర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు



గ్రామ సభలో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, సెప్టెంబరు 22: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలు గుర్తింపునిచ్చారని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి), ఎమ్మెల్సీ బీటీ నాయుడు అన్నారు. ఆదివారం తొండూరు మండలం మల్లేల గ్రామంలో నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం సభలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి వంద రోజుల్లో ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. బీటెక్ రవి మాట్లాడుతూ పింఛన్‌ను పెంచుతామని చెప్పిన రోజు నుంచే ఇచ్చిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. అన్నక్యాంటిన్‌ను పునఃప్రారంభించారన్నారు. రైతులకు నిద్రలేకుండా చేసిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేశారన్నారు. గత ప్రభు త్వంలో అసైన్‌మెంట్‌లో నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరగలేదన్నారు. అర్హులకు భూములు కేటాయించలేదని తెలిసి పాస్‌బుక్కులను దగ్గరే ఉంచుకుని ఎలక్షన్ అయిపోయిన తర్వాత పంపిణీ చేశారన్నారు. తిరుమల లడ్డూను కల్తీ చేసిన హీనమైన చరిత్ర జగన్ ప్రభుత్వానిదని, అందుకే 11సీట్లకే పరిమితం అయ్యారన్నారు. వైసీపీ నేతలు చేసిన అరాచకాలను ప్రజలందరు గుర్తించారన్నారు. అనంతరం ప్రజలు బీటెక్ రవికి తమ సమస్యలను చెప్పి అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు శివమోహన్‌రెడ్డి, నాగిరెడ్డి, మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మురళి, ఎస్‌ఐ పెద్ద ఓబన్న, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## దాడి కేసులో నలుగురు అరెస్టు

### అరెస్టు అయిన వారిలో వైసీపీ కార్పొరేటర్

కడప క్రైం సెప్టెంబరు 22: కడప నగరం సాయిపేటలో ఇటీవల జరిగిన దాడి కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సిఐ నాగర్జున తెలిపారు. సిఐ వివరాల మేరకు సాయిపేటకు చెందిన అస్లాం, అదే ప్రాంతానికి చెందిన యునోస్ లు బంధువులు గత కొంత కాలంగా కుటుంబ మనస్పార్ధలు ఉన్నట్లు తెలిపారు. ఈనెల 20 వతేదిన అస్లాం, కార్పోరేటర్ రఫీ, మరికొందరుతో కలిసి యునోస్, మరోమహిళను కర్రలతోదాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. భాదితుల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈకేసులో ఆదివారం అస్లాం, జావేద్, కార్పోరేటర్ రఫీ, ముక్తియార్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

## ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

### - కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ, కడప స్టీల్ ప్లాంట్ రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, ఇవన్నీ ఒక్క కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. ఆదివారం మదనపల్లె రోడ్డులో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం జిల్లా అధ్యక్షుడిగా గాజుల భాస్కర్ ప్రమాణంలో ఆయన మాట్లాడుతూ మతతత్వ బీజేపీ దేశంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ప్రధాని ప్రభుత్వ ఆస్తులన్నీ ప్రైవేటు కంపెనీలకు ధారాదత్తం చేస్తూ దేశాన్ని ఇతరులకు తాకట్టు పెడుతున్నాడని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర సీనియర్ నేత నల్లకదిరిగాళ్ల శాంతయ్య, రాష్ట్ర మైనార్టీ వైస్ చైర్మెన్ మహమ్మద్‌రఫీ, కిసాన్ సెల్ అధ్యక్షుడు చెన్నక్రిష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు దర్బార్ బాషా, పట్టణ మాజీ అధ్యక్షుడు ఫరూఖ్‌ఖాన్, కాంగ్రెస్ అన్నమయ్య జిల్లా మహిళా అధ్యక్షురాలు, రైల్వేకోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గోశాల దేవి పాల్గొన్నారు.

## తల్లి మరణం తట్టుకోలేక కుమార్తె మృతి



పోరుమామిళ్ల, సెప్టెంబరు 22: తల్లి మృతిని జీర్ణించుకోలేక కుమార్తె మేరమ్మ(45) మృతి చెందింది. రంగసముద్రం పంచాయతీ గిరినగర్‌కాలనీ వాసి కందుల నీలమ్మ నాలుగు రోజుల కిందట మృతి చెందింది. ఆమె మరణాన్ని జీర్ణించుకోలేని ఆమె కుమార్తె మేరమ్మ ఆదివారం గుండెపోటుతో మృతి చెందింది. కుటుంబీకులు శోక సంద్రంలో మునిగారు.



# తమలపాకు రైతు విలవిల

### ● నోరు పండించే ఆకు - రైతు బతుకు పండించలేదు ? ● బుట్ట ధర వంద - కూలి రెండు వందలు



రైతులు సాగుచేసిన తమలపాకు తోట

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 22: శుభ, అశుభ కార్యాల్లో అగ్రస్థానం తమలపాకులదే. తెలుగు సంప్రదాయంలో తమలపాకులకు ఒక ప్రత్యేక స్థానం. ప్రాచీన కాలం నుంచీ కుల మతాలకతీతంగా తమలపాకు వినియోగం ఉంది. వివాహాల అనంతరం విందు భోజనాల చివరలో కచ్చితంగా నోరు పండాల్సిందే. తమలపాకు, వక్క, సున్నం వేసుకుని నమలడం వల్ల తిన్న ఆహారం సక్రమంగా జీర్ణమవుతుందని పెద్దల మాట. స్వీట్ బీడాల్లో సుగంధ ద్రవ్యాలు రంగరించి ఆకు చుట్టి ఇవ్వడంతో దానికి ఒక కొత్తరూపు అవతరిస్తుంది. తిరుపతి హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు వంటి నగరాల్లో పాన్ సెంటర్లు దర్శనమిస్తూ ఉంటాయి. పాన్‌బీడా విలువ రూ. 20 మొదలు రూ. 50 వరకు ఉంటుంది.

తమలపాకును ఉమ్మడి కడప జిల్లాలో చెన్నూరు, ఊటుకూరు, ఖాజీపేట ప్రత్యేకంగా సాగు చేసేవారు. జిల్లాల విభజన అనంతరం అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం ఊటుకూరు, వెంకటరాజంపేట, పుల్లంపేట మండల ప్రాంతాలు. ఓబులవారిపల్లె మండలం చిన్నఓరం పాడు, పెద్దఓరంపాడు, గాదెల, వెంకటరామపురం, తల్లెంవారిపల్లె, అయ్యలరాజుపల్లె, ఓబులవారిపల్లె, పున్నాటివారిపల్లె, కమ్మపల్లి వంటి గ్రామాల్లో కొన్ని కుటుంబాలు పూర్తి స్థాయిలో తమలపాకు పంటనే ప్రధాన ఆదాయ వనరులుగా సాగు చేస్తారు.

రెండేళ్లగా తమలపాకు సాగులో అధిక మొత్తంలో ఖర్చులే గాని ఆదాయం తక్కువగా వస్తోందని సాగు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత కొలతల మేర సాలు తోలి అవిశ విత్తనాలను ఒత్తుగా చల్లుకోవాలి. నాటిన 40 రోజుల నుంచి విత్తనపు తీగ వేసుకోవడానికి అనువుగా తయారవుతుంది. 60 రోజుల నుంచి నూతన తోట నుంచి దిగుబడి మొదలవుతుంది. అంతవరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. సాగు ఖర్చులు కూడా పెరిగిపోవడంతో తమలపాకు దిగుబడి మొదలయ్యే వరకు ఎకరాకు లక్ష రూపాయలకు పైనే పెట్టుబడి పెట్టాల్సివస్తుందని రైతులు వివరించారు. ఒకసారి సాగు మొదలు పెడితే మూడేళ్ల వరకు దిగుబడి వచ్చేది. పంట కాలం ఎక్కువకాలం రావడంతో ఖర్చులు పోను రైతులకు ఆశాజనకంగా మిగులు బడి ఉండేది. ఏటా తిరిగి సాగు చేయడం ద్వారా పంట కాలం తగ్గిపోయింది. ప్రస్తుతం ఏడాదికి మించి ఉంటే రోగాలతో నిలువునా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన దిగుబడి వస్తే అమ్మకాల ధర పలకడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుట్టకు రెండు వేల తమలపాకులు ఉంటాయి. వాటిని కోయడానికి వంద రూపాయలు కూలీ అయితే బుట్ట, వరిగడ్డి, పురికోస, భోజనం కలిపి సుమారు రూ.200 అవుతున్నాయి. వీటిని హైదరాబాదు మార్కెట్‌కు తరలిస్తే వారు నచ్చిన రేటు పట్టీ కట్టి పంపుతారు. పండుగ సీజన్లలో అమ్మకపుదారులు అధిక మొత్తంలో తమలపాకులు కావాలని కోరేవారు. డిమాండ్‌కు తగ్గట్టుగా రేట్లు కూడా ఉండేవి. అయితే సరకు బాగా ఉంటే పండగ సమయాల్లో రూ. 500 నుంచి రూ.600 అమ్మకాలు చేపడుతున్నారు. మిగిలిన సరకు మొత్తానికి రూ.80 నుంచి రూ.150 వరకు రేట్లు కడుతుండడంతో రైతులు ఇవ్వక తప్పడంలేదు. అధిక ఖర్చులు అవడంతో సాగును తగ్గించేస్తున్నారు. రేట్లు తగ్గడానికి కారణం అడిగితే గతంలో వారానికి మూడు రోజులు మాత్రమే హైదరాబాద్ మార్కెట్‌కు సరకు వెళ్లేదని, ప్రస్తుతం ప్రైవేటు బస్సుల ద్వారా రోజూ తమలపాకులు వెళుతుండ డంతో మార్కెట్టు కట్టడి చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా ఎకరాకు పైబడి సాగుచేసే రైతు 20 నుంచి 30 సెంట్లకే పరిమితం అవుతున్నారు. ఖర్చులు భరించలేక నచ్చిన పంట వదులుకోలేక కొంతే సాగు చేస్తున్నారు.

### ప్రత్యామ్నాయ సాగు కోసం....



మేము కొన్నేళ్లుగా తమలపాకు సాగుతో జీవనం సాగిస్తున్నాం. తమలపాకు సాగులో తెలిసినన్ని మెళుకువలు మరొక పంట సాగుబడికి తెలియదు. అప్పట్లో డబ్బు బాగా వచ్చేవి. ప్రస్తుతం చాలా ఇబ్బందిగా ఉంటోంది. మరొక పంట సాగు చేయడానికి ప్రత్యామ్నాయంగా చూస్తున్నాం.

*ప్రసాద్‌రెడ్డి, ఓబులవారిపల్లె*



### డిమాండ్ తగ్గింది



రోజూ హైదరాబాదు మార్కెట్‌కు తమలపాకులు వెళ్లడంతో డిమాండ్ తగ్గింది. బస్సులు ద్వారా వంద నుంచి 500 బుట్టలు వెళుతున్నాయి. ఫలితంగా రోజూ అమ్మకాలు సాగుతూ ఉండడంతో కొందరికి లాభాలు వస్తున్నాయి. రోజూ సరకు వెళ్లకుండా కట్టడి చేస్తే డిమాండ్ పెరిగి అందరికీ ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

*దాసరి సుబ్రమణ్యం, అయ్యలరాజుపల్లె.*

## ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు మృతి



సురేంద్ర

కాశినాయన సెప్టెంబరు22: నర్సన్నపల్లె వాసి బుస్కాని సురేంద్ర(26) ట్రాక్టర్‌లో వెళుతూ ప్రమాద వశాత్తు చెట్టుకు తగిలి మృతి చెందినట్లు ఎస్ఐ హనుమంతు తెలిపారు. సుబ్బయ్య కుమారుడు సురేంద్ర శనివారం పొలం సేద్యం చేసేందుకు ట్రాక్టర్‌లో వెళుతుండగా మూలపల్లె మలుపు వద్ద ట్రాక్టర్ అదుపుతప్పి వేపచెట్టును ఢీకొంది. క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం పోరుమామిళ్ల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమర్టం కోసం తరలించామన్నారు.

## చికిత్స పొందుతూ మహిళ...

సిద్దవటం, సెప్టెంబరు 22: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న ఎం.లక్ష్మీదేవి(48) మృతిచెందినట్లు మృతురాలి బంధువులు తెలియజేశారు. కడప - చెన్నై రహదారి మాధవరం-1 వద్ద పార్వతీపురం వాసి ఎం.లక్ష్మీదేవి శనివారం రాత్రి రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది. తలకు గాయమైన ఆమెను కడప రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స అందిస్తుండగా శనివారం రాత్రి 10 గంటలకు మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు.

## వ్యక్తి పై దాడి - తీవ్రగాయాలు



దాడి వివరాలు తెలుపుతున్న ప్రహ్లాద

రైల్వేకోడూరు, సెప్టెంబరు 22: ఓబనపల్లె దళితవాడ వాసి కనుపర్తి ప్రహ్లాదపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాల్లోకెళితే... ఓబనపల్లె దళితవాడకు వాసి ప్రహ్లాదకు ఆటోమొబైల్స్ దుకాణం ఉంది. రోజు మాదిరే మధ్యాహ్నం దుకాణం మూసుకుని ఇంటికి వెళుతుండగా దళితవాడ టర్నింగ్ వద్ద కాపు కాసిన సుమారు నలుగురు వ్యక్తులు రెండు మోటారు బైకుల్లో వేగంగా వచ్చి రాడ్లతో దాడి చేసి పరారీ అయ్యారని గ్రామస్తులు తెలిపారు. ప్రహ్లాదకు గతంలో గ్రామానికి చెందిన ఈ. శ్రీనువాసులుకు పాతకక్షలు ఉన్నాయని ఈ దాడి కూడా పాతకక్షలతోనే జరిగిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిందితులు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు, ఎవరు పంపారనే విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుపై విచారిస్తున్నారు.

## పేలుళ్లతో నెర్రెలు చీలిన ఇళ్లు



మైదుకూరు రూరల్, సెప్టెంబరు 22: ముద్దిరెడ్డిపల్లెలో ఆదివారం బాంబు పేలుళ్లకు గ్రామంలోని ఇండ్లు నెర్రెలు చీలాయి. గ్రీన్ ఫీల్డ్ హైవే ఆధ్వర్యంలో మైదుకూరు నుంచి సింగరాయకొండ వరకు కొనసాగుతున్న రోడ్డు పనుల్లో భాగంగా ముద్దిరెడ్డిపల్లె వద్ద ఒక గుట్టను పగులకొట్టేందుకు బాంబులు పెట్టి పేల్చి కంకర తీస్తున్నారు. కొద్ది మోతాదులో మాత్రమే మందుగుండు పెట్టి పేల్చాలి. కానీ ఎక్కువ మోతాదు మందు పెట్టడంతో గ్రామంలోని ఇండ్లు చాలా వరకు నెర్రెలు చీలాయి. దీంతో గ్రామస్తులు ఆపనులను ఆపించేశారు. సోమవారం గ్రామస్తులు, కాంట్రాక్టర్లు సమావేశం కానున్నారు.

## పునరావాసానికి మతిస్థిమితంలేని వారు

### మానవతా దృక్పధంతో స్పందించండి ● ఆస్పత్రిలో చేర్పడానికి సహకరించండి : మనోబంధు ఫౌండేషన్ ఫౌండర్



మానసికంగా వైకల్యంతో రోడ్ల పై తిరిగే వారిని రిహాబిలిటేషన్ సెంటర్‌కు తరలిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 22: మానసిక రుగ్మతతో బాధపడుతున్న వారిని మానవతాదృక్పధంతో పునరావాసా కేంద్రానికి తరలించేందుకు సహకరించాలని మనోబంధు ఫౌండేషన్ ఫౌండర్ రామకృష్ణ పిలుపునిచ్చారు. ఆదరించే వారు లేక వీధుల్లో మతిస్థిమితంలేకుండా తిరిగే వారి జాడ తెలపాలని కోరారు. ప్రొద్దుటూరు ఎర్రగుంట్ల ప్రాంతాల్లో మతి స్థిమితం లేని వారిని గుర్తించి స్థానిక పోలీసుల సహకారంతో వారిని అంబులెన్సులో కడప రిమ్స్‌లోని మానసిక వికలాంగుల పునరావాస కేంద్రానికి తరలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణాల్లో మన చుట్టూ మతిస్థిమితం లేక దుర్భరంగా జీవిస్తుంటారన్నారు. ఇలాంటి వారు ఆదరించే వారు లేక ఎటువంటి దిక్కు లభించక నిరాశ్రులై వీధుల్లో తిరుగుతూ వుండడం మానవత్వానికి మచ్చ అన్నారు. వారిని సమీకరించి తగు వైద్య వసతి సదుపాయాలు ఏర్పరచి వారిని వారి కుటుంబాలతో తిరిగి కలిపేలా చేయడం కోసం మనోబంధు సంస్థ కృషి చేస్తోందన్నారు. 2021 అక్టోబరులో ఈ సంస్థను ప్రభుత్వ మాజీ కార్యదర్శి అజయ్ కల్లాం ద్వారా ప్రారంభించామన్నారు. మతి స్థితిమితం లేక నిరాశ్రయులైన వారువుంటే 92465 63738 మొబైల్ నెంబర్లుకు సంప్రందించాలన్నారు. వారిని స్వచ్ఛంద సంస్థలు పోలీసులు సహకారంతో పునరావస కేంద్రంలో చికిత్స అందించి వారికి కొత్త జీవితం ప్రసా దించిన వారవుతారన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఆర్‌డీ పుత్తా శివారెడ్డి, కుమార స్వామి రెడ్డి, ఆదరణ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

## చాంపియన్ షిప్ పోటీల్లో మెరిసిన ఆణిముత్యాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు22: కర్నూలు జిల్లాలో ఆదివారం జరిగిన అంతర్ రాష్ట్ర కరాటే చాంపియన్ షిప్ 2024 పోటీల్లో లీడ్రాగన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ముగ్గురు గోల్డ్ మెడల్, మరో ముగ్గురు సిల్వర్ పథకాలు సాధించి చరిత్ర సృష్టించారు. వీరిలో ముగ్గురు సిల్వర్ పథకాలు సాధించి చరిత్ర సృష్టించారు. పుల్లగూర గంగాతనోశ్, తహోమరచన్, ముమెన్, బంగారు పతకాలు సాధించగా కొండూరు చేతన్ వర్మ, చరిష్మా, ఆసిఫా వెండి పతకాలు సాధించారు.

## పులివెందులలో భారీ చోరీ

### - 750 గ్రాముల బంగారు, రెండున్నర కిలోల వెండి, లక్ష రూపాయలు చోరీ



వస్తువులు చిందర వందరగా పడేసిన దృశ్యం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 22: విజయ హోమ్స్ ప్లాటు నెం.149లో హెచ్‌పీ గ్యాస్‌డీలరు హరినాధరెడ్డి ఇంట్లో దొంగలు జొరబడి బంగారు, వెండి నగలు సహా లక్ష రూపాయలు నగదు దోచుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు వివరాలిలా.. వ్యక్తిగత కారణాలతో హరినాథ్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బెంగుళూరు వెళ్లారు. శనివారం అర్ధరాత్రి దొంగలు తాళాలు పగలగొట్టి ఇంట్లో ఉన్న 750 గ్రాముల బంగారు, రెండున్నర కిలోల వెండి, లక్ష రూపాయల నగదు చోరీ చేశారు. ఆదివారం ఉదయం పనిమనిషి ఇంటి వద్దకు రాగా మెయిన్ డోరుకు ఉన్న తాళాలు పగలగొట్టి ఉండడం చూసి ఇంటి యజమానులకు ఫోను ద్వారా సమాచారం అందించింది. దీంతో వారి బంధువులు వచ్చి ఇంట్లో ఉన్న వస్తువులను చెల్లాచెదరుగా పడి ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచా రం అందించారు. సంఘటనా స్థలానికి డీఎస్పీ మురళినాయక్, సీఐ జీవన్ గంగానాథ్‌బాబు, సిబ్బందితో చేరుకున్నారు. యజమానికి సమాచారం అందించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్స్‌ను రంగంలోకి దింపి ఫింగర్‌ప్రింట్స్ సేకరించారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ విలేకరులకు తెలిపారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

## రాజంపేటలో రెచ్చిపోయిన దొంగలు



చిందరవందరగా ఉన్న వస్తువులు

రాజంపేట టౌన్, సెప్టెంబరు 22: స్థానిక క్రిష్ణానగర్‌లో శనివారం అర్ధరాత్రి ఓ ఇంట్లో దొంగలు రెచ్చిపోయారు. పుల్లంపేట మండలం కొత్తపల్లె వాసి టీచర్ ఇంద్రావతి చిత్తూరు డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగరాజు దంపతులు కుమారుడితో కలిసి బెడ్‌రూంలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి గుర్తు తెలియని అగంతకుడు ఇంట్లోకి చొరబడి గదిలోని తాళాలు తీసి బీరువాలో ఉన్న 20 తులాల బంగారు, 2 లక్షల నగదు అపహరించినట్లు బాధితులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకు న్నారు. పట్టణ సీఐ ఎల్లమరాజు, ఎస్ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, లోకేష్, ఏఎస్ఐ వర్మ తదితర పోలీసు సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాన్ని రంగంలోకి దింపి ఘటన స్థలాన్ని పరిశీలించారు.

## ఫారెస్టు అధికారుల బదిలీ

కడపక్రైం సెప్టెంబరు 22: జిల్లాలో పనిచేస్తున్న ఫారెస్టు రేంజ్ అధికారులను బదిలీ చేస్తు ఆశాఖ ఉన్నాతాధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. బద్వేలులో పనిచేస్తున్న పి.వి.రమణారెడ్డిని కర్నూలు ఫ్లయింగ్ స్క్వాడ్‌గా, కడప ఎఫ్ ఎస్‌పి విభాగంలో పనిచేస్తున్న నయీమ్ అలీని బద్వేలుకు, మదనపల్లిలో పనిచేస్తున్న మదన్ మోహన్ రెడ్డిని కడప డివిజన్ ఫ్లయింగ్ స్క్వాడ్, శ్రీశైలం టైగర్ జోన్‌లో పనిచేస్తున్న నరసింహులు జమ్మలమడుగు ఎఫ్ఎఫ్ రేంజ్‌కు బదిలీ అయ్యారు.

## ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047

### క్యూ ఆర్ కోడ్ స్కాన్ ద్వారా ప్రజల అభిప్రాయాల సేకరణ

కడప(కలెక్టరేట్) సెప్టెంబరు 22: స్వర్ణాంధ్ర ప్రదేశ్ -2047 లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటన ద్వారా జిల్లా ప్రజలకు పిలుపు నిచ్చారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దూర దృష్టితో స్వర్ణాంధ్ర-2047 విజన్ అభివృద్ధి కోసం సమగ్రంగా కసరత్తు చేపట్టిందన్నారు. స్వర్ణాంధ్ర దార్శనిక పత్రం అనేది ఆర్థికాభివృద్ధి సామాజికాభివృద్ధి వాతావరణ సుస్థిరతలపైన దృష్టి సారిస్తూ 2047 నాటికి భారత దేశానికి ఒకస్థూలవృద్ధి కేంద్రంగా రాష్ట్రాన్ని తయారు చేసేందుకు కావాల్సిన కార్యాచరణ ప్రణాళికను నిర్దేశిస్తుంది. 1వ తేదీన ఈ విజన్ -2047 పత్రాన్ని ఆవిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు స్వర్ణ కడప దిశగా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కరపత్రాలు, పోస్టర్ల ద్వారా సమాచారం చేర వేస్తామన్నారు ప్రభుత్వం రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి స్వర్ణాంధ్ర-2047పై సలహాలు ఇవ్వాలని కలెక్టర్ కోరారు.

## గ్రావెల్ టిప్పర్ పట్టివేత

పెండ్లిమర్రి, సెప్టెంబరు 22: మండలంలోని గొందిపల్లె గ్రామ సమీపంలోని గుట్టల్లో నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్‌ను సీజ్ చేశారు. ఆదివారం గుర్రాల చింతపల్లె వద్ద సాయంత్రం విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు పర్మిట్‌లు పరిశీలించారు. ఎలాంటి పర్మిట్ లేకపోవడంతో టిప్పర్ సీజ్ చేశారు. వెల్లటూరు వద్ద కాటా వేసి ఓవర్ లోడ్ ఉన్నట్లు గుర్తించారు. పెండ్లిమర్రి పోలీస్‌స్టేషన్‌లో టిప్పర్‌ను అప్పగించారు.

## 'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కడప (సెవెన్‌రోడ్స్), సెప్టెంబరు 22: కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ స్పోర్ట్స్ వైస్ చైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వర్‌రావుపై దాడి చేసిన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీపైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మనోహర్, శ్రీనివాస్‌లరెడ్డి, జిల్లా కోశాధికారి లక్ష్మీదేవి ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్‌చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

## పొలతల క్షేత్రంలో స్వచ్ఛభారత్

పెండ్లిమర్రి, సెప్టెంబరు 22: పొలతల మల్లేశ్వరస్వామి క్షేత్రంలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఆదివారం ఆలయ కార్యనిర్వాహణాధికారి కృష్ణానాయక్, రాజ జారెడ్డి అర్చకులు కలిసి క్షేత్రంలోని పుట్టాంజనేయ స్వామి దేవస్థానం చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



# కుక్కల వీరంగం.. ప్రేక్షక పాత్రలో యంత్రాంగం



కమలాపురం వీధుల్లో తిరుగుతున్న కుక్కలు(ఇన్‌సెట్) కుక్కల దాడిలో గాయపడిన చిన్నారులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 22: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువవుతోంది. రోడ్డున నడిచే చిన్నపిల్లాడు మొదలు వయోవృద్ధుల వరకు కుక్కల దాడికి గురికాని వారు లేరు. రాత్రీపగలు తేడా లేకుండా రోడ్లపై కుక్కలు తిరుగాడుతూ పాదచారులు, బైక్ రైడర్స్‌పై సైతం దాడి చేస్తున్నాయి. దీంతో ఇళ్ల నుంచి ప్రజలు బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. కుక్కల సంతతి నివారణకు శస్త్రచికిత్స చేయించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి కనిపించడంలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకెళితే... పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో దాదాపు మూడువేలకు పైగా కుక్కలు ఉన్నట్లు తెలుస్తోంది. కుక్కలు రాత్రి, పగలు తేడా లేకుండా వీధుల్లో గుంపులుగా తిరుగుతూ స్థానికులు, ప్రధాన దారుల్లో వచ్చి పోయే వాహనదారులపై దాడులకు పాల్పడుతున్నాయి. పట్టణ ప్రాంతంలోనే కాకుండా మండలంలోని వివిధ గ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. కనీసం వాటికి యాంటి రేబిస్‌టీకాలు కూడా వేయించిన దాఖలాలు లేవు. పట్టణంలో సైతం వీధికుక్కలు బీభత్సం చేస్తున్నాయి. వికలాంగుల కాలనీలో ఓ బాలికపై దాడి చేసి ఘటన మరువకముందే మరో కాలనీలో పెద్దగా దాడులు చేసినట్లు ఇటీవల సీసీ పుటేజీలు బహిర్గతం కావడంతో పట్టణ ప్రజలు మరింత భయానికి గురవుతున్నారు. నగర పంచాయతీ, 3వ వార్డు పరిధిలో నాయీ బ్రాహ్మణ వీధిలో ఒక చిన్నపాపను కుక్క పట్టుకుని తీవ్రంగా గాయపరిచింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. వాటిని నివారించాల్సిన అధికార యంత్రాంగం ప్రేక్షకపాత్ర వహిస్తోందని ఆరోపిస్తున్నారు. కుక్కలకు శస్త్రచికిత్స చేయించి సంతతి కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

### పెరుగుతున్న పందుల బెడద

పట్టణంలో పందుల బెడద కూడా ఎక్కువగా ఉంది. గత ప్రభుత్వంలో అభివృద్ధి పేరుతో మురుగునీటి కాల్వల నిర్మాణం చేపట్టారు. అవి అసంపూర్తిగా ఉండడంతో పట్టణంలో మురుగునీరు నిల్వ ఉంటోంది. ఫలితంగా ఆవాసాల మధ్య పందులు సంచరిస్తూ ప్రజలకు ఇబ్బంది కలగజేస్తున్నాయి. ఇటీవల పందులు వల్ల పలువురు గాయపడినట్లు తెలుస్తుంది. వీరిలో ఎక్కువ మంది పిల్లలు వృద్ధులు ఉన్నట్లు సమాచారం. అంతేకాకుండా జ్వరాలు వ్యాపించి ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారు. దీంతో ఇప్పటికైనా నగర పంచాయతీ అధికారులు కమలాపురంలో విచ్చలవిడిగా తిరుగుతున్న పందులను ఊరికి దూరంగా తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే గత కమిషనర్ల దృష్టికి పలుమార్లు మీడియా దృష్టికి తీసుకెళ్లినా నిద్రమత్తు వదలని నగర పంచాయతీ సిబ్బంది, అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

## వరద బాధితులకు చేయూత



బీటెక్ రవికి చెక్కులను అందిస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, సెప్టెంబరు 22 : విజయవాడ వరద బాధితులకు సాయం అందించేదుకు పలువురు ముందుకు వచ్చారు. పులివెందులకు చెందిన ఒంటెద్దు మల్లిఖార్జునరెడ్డి రూ.50వేలు, ఒంటెద్దు చంద్రశేఖర్‌రెడ్డి రూ.50116 విరాళంగా చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జ్ మారెడ్డి రవీంద్రరెడ్డి (బీటెక్‌రవి)కి అందించారు. ఈ సందర్భంగా వారిని బీటెక్ రవి అభినందించారు. వరద బాధితులకు సహాయం అందించిన ప్రతి ఒక్కరినీ అభినందించారు. అలాగే ఎవరైనా దాతలు ఉంటే ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బీటీ నాయుడు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## వరద బాధితులకు సామగ్రి పంపిణీ

కడప (నాగరాజుపేట), సెప్టెంబరు 22 : విజయవాడ వరద బాధితులకు దుప్పట్లు, లుంగీలు, టవల్స్, చీరలతో కూడిన సామగ్రి పంపిణీ చేశామని దూదేకుల సంఘం గౌరవాధ్యక్షుడు ఓబులేసు, రాయలసీమ వర్కింగ్ ప్రెసిడెంట్ ఇదాదుల్లా అన్నారు. ఆదివారం విజయవాడలోని ముంపు ప్రాంతాలను పరిశీలించి సాయమందించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 22: కడప నగరంలో టీవీ టెక్నీషియన్స్‌గా సేవలందిస్తూ జీవనం సాగిస్తున్న వారి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని టీడీపీ కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. ఆదివార స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కడప సిటీ టీవీ టెక్నీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్, ఏపీ రాష్ట్ర ఎలక్ట్రానిక్స్ అండ్ టీవీ మెకానిక్స్ ట్రేడ్ యూనియన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. కార్యక్రమానికి మాధవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. టెక్నీషియన్ రంగంలో ప్రావీణ్యం సంపాదించుకున్న వారు ఎక్కడైనా జీవించగలరన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, టెక్నీషియన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆశాలపై అధికారులు వేధింపులు ఆపాలి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 22 : జిల్లాలో ఆశా కార్యకర్తలపై అధికారులు, రాజకీయ నాయకులు వేధింపులు ఆపాలని ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు మరియమ్మ, పులివెందుల ఏరియా నిర్మాణ బాధ్యుడు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పులివెందులలోని జూనియర్ కళాశాల ఆవరణంలో జరిగిన ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ పులివెందుల నియోజకవర్గం సమితి ముఖ్యనాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు.జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అధికారులు అదనపు పని చేయాలని లేకుంటే రాజీనామాలు చేయాలని ఒత్తిడి చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. సీపీఐ ఏరియా కార్యదర్శి బి.వెంకటరాముడు, ఆశా యూనియన్ జిల్లా కోశాధికారి అమ్ములు, నియోజకవర్గనాయకులు ఉమాదేవి, చంద్రకళ, శైలజ, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

పులివెందుల రూరల్, సెప్టెంబరు 22: మండలంలోని నల్లపురెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వసమ్మేళన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒక్కచోట చేరారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఒక్కచోట చేరడంతో ఒకరికొకరు ఆప్యాయంగా పలుకరించుకొని కుటుంబ నేపథ్యాలను తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. లింగాల మండల ఎంఈఓ-2 రామకృష్ణయ్య, ఏపీజెన్కోలో పనిచేస్తున్న వెంకటరామిరెడ్డి, మైనింగ్ ఇంజనీర్ ఓబుల్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, టీచర్లు మహేశ్వర్‌రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

## 'మాజీ ఎమ్మెల్యే మాటలు అర్థరహితం'



మాట్లాడుతున్న ఖాదర్ బాషా

కమలాపురం రూరల్, సెప్టెంబరు 22: టీడీపీ ప్రభుత్వంపై మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి విమర్శించడం విడ్డూరంగా ఉందని టీడీపీ ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ గత ఐదు సంవత్సరాల పాలనలో చేసింది శూన్యమన్నారు. అందుకే ప్రజలు తిరస్కరించారని, అది ఓర్వలేకే టీడీపీ ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధికి రూ.2వేల కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. కానీ పదేళ్లు ఎమ్మెల్యేగా రవీంద్రనాథరెడ్డి ఒక్క అభివృద్ధి పనీ చేయకపోగా విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగుల పురోగతికి శ్రీనివాసులు కృషి అభినందనీయం

● సత్కారంలో కడప డిపో ఎన్ఎంయూ అధ్యక్షుడు జయరాం



శ్రీనివాసులును సత్కరిస్తున్న జయరాం తదితరులు

కడప (మారుతీనగర్), సెప్టెంబరు 22: ఆర్టీసీ ఉద్యోగుల పురోగతికి కడప డిపో కండక్టర్ సగినాల శ్రీనివాసులు కృషి అభినందనీయమని ఆ డిపో ఎన్ఎంయూ అధ్యక్షుడు టి.జయరాం కొనియాడారు. శ్రీనివాసులు సేవలను గుర్తించి విజయవాడలో ఈనెల 21న జరిగిన ఆ సంఘం వార్షిక మహాసభలో ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చేతులమీదుగా శ్రీనివాసులు అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు గాను ఆదివారం కడప ఎన్ఎంయూ కార్యాలయంలో శ్రీనివాసులును సత్కరించారు. ఈ సందర్భంగా జయరాం మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పొదుపు, పరపతి సహకార సంఘం లిమిటెడ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 29 మంది సభ్యులు సభ్యత్వం స్వీకరించేలా శ్రీనివాసులు కృషి చేశారన్నారు. కడప డిపో ఎన్ఎంయూ నాయకులు భాస్కర్‌రెడ్డి, లక్ష్మీరెడ్డి, వరదారెడ్డి, గోపాల్, రెడ్డయ్య, సి.ఎస్.రెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జిగా అలీఖాన్

కడప(కలెక్టరేట్), సెప్టెంబరు 22: కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా ఇన్‌చార్జిగా అలీఖాన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం విజయవాడలోని ఆంధ్ర రత్న భవన్‌లో రాష్ట్రంలోని జిల్లా ఇన్చార్జులతో పీసీసీ చీఫ్ సమావేశం నిర్వహించి రాష్ట్ర వ్యాప్తంగా ఇన్చార్జ్‌లను నియమించారు. కడప జిల్లా కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా ముసాని శ్రీనివాస రెడ్డిని నియమించారు.

## చింతకొమ్మదిన్నె గంగమ్మకు పూజలు

సీకేదిన్నె, సెప్టెంబరు 22: చింతకొమ్మదిన్నె మండలం కొత్తపేట గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు తీర్చుకుని పిల్లాపాపలు, పాడిపంటలు చల్లగా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా గంగమ్మ అమ్మవారిని పలువురు కొలుస్తారు. ప్రతి ఆదివారం చింతకొమ్మదిన్నె గంగమ్మ ఆలయానికి భక్తులు తరలివస్తారు. తమ మొక్కులు తీర్చుకుని బంధుమిత్రులను ఆహ్వానించి విందు ఆరగించారు.

## దుర్భర స్థితిలోనూ సంక్షేమ బాట: ఎమ్మెల్యే మాధవి



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : వైసీపీ ఐదేళ్లపాలనలో రాష్ట్రపరిస్థితి దుర్భరంగా మారినా ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సంక్షేమ బాట పట్టిందని కడప ఎమ్మెల్యే మాధవి తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం 21వ డివిజన్ బాలవికాస్ పాఠశాల సమీపంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్థానిక ప్రజలకు భరోసా కల్పించారు. వైసీపీ పాలనలో అన్నిరంగాలను భ్రష్టుపట్టించారన్నారు. ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, రైతుబజార్లు, సచివాలయాలు ఇలా అన్నింటినీ తనఖా పెట్టి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారన్నారు. చంద్రబాబు మళ్లీ అన్నింటినీ గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, రాష్ట్రంలో సంక్షేమపాలన అందజేస్తున్నారన్నారు. అడిషనల్ కమిషనరు రాకేశ్‌చంద్రం, నాయకులు పాల్గొన్నారు.

## బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లు తొలగించాలి

● ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి కులశేఖర్ రెడ్డి



మాట్లాడుతున్న కులశేఖర్ రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : బోధనకు ఆటంకంగా ఉన్న యాప్‌లను తొలగించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి కులశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఎన్జీఓ హోంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై ఏపీటీఎఫ్ నిరంతర పోరాటం చేస్తోందన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితులు లేవన్నారు. ఆటంకంగా ఉన్న అనవసర యాప్‌లను తొలగించాలని మీడియం, సిలబస్ తరగతుల విలీనంపై స్పష్టత ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, రాష్ట్ర అకడమిక్ సభ్యుడు సాంబశివరెడ్డి, కడప డీసీఈబీ సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీఓ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలన్నారు. జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, నాగభూషణం పాల్గొన్నారు.

## ఇందిరానగర్‌లో నాకాబందీ



విచారణ చేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరెడ్డి

సీకేదిన్నె, సెప్టెంబరు 22: చింతకొమ్మదిన్నె మండలం కార్పొరేషన్‌లో విలీనమైన ఇందిరానగర్‌లో ఆదివారం నాకాబందీ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి సీఐ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో రిమ్స్ సీఐ, చిన్నచౌక్ సీఐ, ఎస్ఐలు 50 మంది పోలీసులతో నాకాబందీ నిర్వహించారు. ఇందిరానగర్‌లో తనిఖీ చేసి పాత నేరస్థులను, అనుమానాస్పద వ్యక్తులను విచారించారు. అదేవిధంగా రికార్డులు సక్రమంగా లేని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అయిదు ఆటోలు, 11 మోటారు సైకిళ్లను స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

## 'అమరజీవి పేరు పునరుద్ధరించాలి'

కడప (కల్చరల్), సెప్టెంబరు 22: హైదరాబాద్‌లో గల అమరజీవి పొట్టి శ్రీరాములు పేరుతో గల తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరు తొలగించి తెలంగాణకు చెందిన సీపీఐ నాయకుడు సురవరం ప్రతాప్‌రెడ్డి పేరుతో మార్పు చేయడం సరికాదని పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు పడుచూరి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆ విశ్వవిద్యాలయానికి తిరిగి అమరజీవి పొట్టి శ్రీరాములు పేరు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఆదివారం వాసవీ క్లబ్ అధ్యక్షుడు లక్ష్మయ్య కార్యాలయంలో వాసవి క్లబ్స్ ఇంటర్‌నేషనల్ ఏవీఎస్‌వీకే ఎస్పీ కడప క్లబ్, ఏపీ ఆర్యవైశ్య మహాసభ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

## 'విద్యార్థినిని చితకబాదిన టీచర్‌పై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : కడప జిల్లా బద్వేలు బాలికోన్నత పాఠశాలలో చదువుతున్న ఏడో తరగతి నైమా అనే విద్యార్థి ని ఉపాధ్యాయురాలు ఇష్టానుసారంగా కొట్టడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వి.రవి తెలిపారు. ఆదివారం కడప రిమ్స్‌లో ఆ విద్యార్థినిని రవి పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థిని తరగతిలో పాఠాలు వింటుండగా వేరేతరగతి గదిలో నుంచి వచ్చిన మరో విద్యార్థికి అవసరమైన సామగ్రి అడగ్గా తన వద్ద లేదని చెప్పడంతో అదే తరగతిలో ఉన్న ఉపాధ్యాయురాలు విద్యార్థినిని కొట్టడం దారుణమన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రాజేష్, వినయ్ పాల్గొన్నారు.

## నిమజ్జనం కాల్వ వద్ద ఏబీవీపీ స్వచ్ఛభారత్

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : వినాయకచవితి నిమజ్జనం అనంతరం కడప నగరం నిమజ్జన కాల్వ వద్ద ఏబీవీపీ వైవీయూ శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని కాల్వ పరిసరాలను శుభ్రం చేసి పర్యావరణం పరిరక్షణకు సంబంధించిన సందేశాలను విస్తృతంగా ప్రచారం చేశారు. యూనివర్సిటీ అధ్యక్షుడు అనిష్ మాట్లాడుతూ మన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడం మనందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ తమ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు ప్రతి ఒక్కరూ చేసి పర్యావరణం కాపాడాలని తెలిపారు. స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంటు కన్వీనరు పుల్లయ్య, సోషల్ మీడియా కన్వీనరు కిరణ్‌కుమార్, జావీదు, అరవింద్, అరుణ్ పాల్గొన్నారు.

## కొండపేట చెరువుకు నీరిచ్చి రైతులను ఆదుకోండి

చెన్నూరు, సెప్టెంబరు 22 : అయిదు వందల ఎకరాల ఆయకట్టు ఉన్న కొండపేట చెరువుకు నీరిచ్చి రైతులను ఆదుకోవాలని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని ఆ గ్రామ సీనియర్ టీడీపీ నేత, మాజీ సర్పంచ్ మణ్యం మోహన్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం కమలాపురంలోని ఆయన స్వగృహం వద్ద రైతులతో మాట్లాడారు. అనంతరం మాట్లాడుతూ పేరుకే అగ్రిమెంటు చెరువు అని, మైదుకూరు నుంచి కొండపేట కాల్వ అని చెప్పుకోవడమే తప్ప ప్రతి సంవత్సరం నీరు రావడం ఆలస్యమేనన్నారు. రైతు నాయకులు రామక్రిష్ణ, బ్రహ్మయ్య, బి.నాగిరెడ్డి పాల్గొన్నారు.

## టీటీడీలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరపాలి

● ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : గత ప్రభుత్వంలో టీటీడీలో జరిగిన నిధుల దుర్వినియోగం, అవినీతి అక్రమాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆర్ఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఆర్ఎస్‌యూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ప్రసిద్ధి చెందిన తిరుమల-తిరుపతి దేవస్థానంలో అనేక అవినీతి అక్రమాలతో పాటు అధికార దుర్వినియోగం జరిగిందని కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని సీబీఐ విచారణ చేస్తేఅన్ని విషయాలు బయటపడతాయన్నారు. అధికార దుర్వినియోగం పాల్పడ్డ వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యు జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, నగర అధ్యక్షుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలి

చెన్నూరు, సెప్టెంబరు 22 : తిరుమల లడ్డూ పవిత్రతను కాపాడాలని టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి షేక్ ముక్తియార్ అన్నారు. ఆదివారం చెన్నూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పవిత్రమైన తిరుమల లడ్డూ భగవంతుని అర్పించే మహాప్రసాదమని, ఆ ప్రసాదాన్ని అన్ని మతాల వారు అన్ని కులాల వారు స్వీకరిస్తారన్నారు. ఈ విషయంలో తప్పు చేసిన వారిని వదిలిపెట్టకూడదని డిమాండ్ చేశారు.

### తిరుమల లడ్డూపై వైసీపీ నిర్వాకం బయట పెట్టాల్సిందే

చెన్నూరు, సెప్టెంబరు 22 :తిరుమల లడ్డూపై వైసీపీ నిర్వాకం బయట పెట్టాల్సిందేనని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని వేల సంవత్సరాలుగా తిరుమల పవిత్రత ఎంతో గొప్పగా విరాజిల్లుతోందన్నారు. లడ్డూ అపవిత్రన జరిగిన సమయంలో ఏ అధికారి ఉన్నారో లోతుగా విచారించి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## మహ్మద్ ప్రవక్త సూచించిన మార్గంలో నడవాలి



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కడప (ఎడ్యుకేషన్), సెప్టెంబరు 22 : ప్రపంచ మానవాళి ప్రవక్త మహ్మద్ సూచించిన మార్గంలో నడిచి పుణ్యకార్యాలు చేయాలని కడప మాజీ డిప్యూటీ మేయర్ అరిఫుల్లా అన్నారు. ఆదివారం కడప నగరం 28వ డివిజను గాజులవీధిలో పఠాన్ అల్లాబకాష్ ఆధ్వర్యంలో గ్యార్మి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు తమ వంతుగా పేదలకు సాయం చేస్తూ వారి కష్టసుఖాల్లో ఉండాలని ప్రవక్త బోధించారన్నారు. ప్రవక్త సూచించిన మార్గంలో ఆర్థికంగా బలపడిన ముస్లింలు పేదలకు సహాయం చేయాలని కోరారు. మౌల్వి న్యామతుల్లా, బి.అబ్దుల్లా, మహ్మద్ ఆలీ, సాదక్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత లక్ష్మిరెడ్డి మృతి



నివాళులర్పిస్తున్న పుత్తా నరసింహారెడ్డి

కడప(రూరల్), సెప్టెంబరు 22: కమలాపురం నియోజక వర్గ పరిధిలోని 18వ డివిజన్ విశ్వనాథపురానికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మిరెడ్డి ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. 18వ డివిజన్ నాయకులు బయ్యారెడ్డి, ఊటుకూరు మాజీ సర్పంచ్ పొన్నోలు సుబ్బిరెడ్డి, 18వ డివిజన్ ఇన్‌చార్జ్ నాయకులు సిరాజ్‌బాషా, టీడీపీ తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు రహమాన్, నాయకులు నాగేశ్వరరెడ్డి, అక్బర్‌బాషా, సద్దాం హుసేన్ నివాళులర్పించారు.

## శిల్పారామంలో ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

కడప (కల్చరల్), సెప్టెంబరు 22 : కడప శిల్పారామంలో ఆదివారం ఆటవిడుపులో భాగంగా చిన్నారుల కోలాటం ఆహూతులను అలరించింది. కడప నగరానికి చెందిన నృత్య కళాకారిణి విజయశాంతి సారథ్యంలో ముద్ర డ్యాన్స్ అకాడమీకి చెందిన చిన్నారులు వివిధ జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. శిల్పారామం పరిపాలనాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో మిస్సో మూవీ సహకారంతో శిల్పారామం కళావేదిక మీద ఆటాపాట అలరించింది.

## ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

మైదుకూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, సెప్టెంబరు 22 : ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆదివారం బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల గ్రామ పంచాయతీలో నిర్వహించిన మన మంచి ప్రభుత్వం కార్యక్రమా నికి ముఖఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో పుట్టా సుధాకర్‌యాదవ్ మాట్లాడుతూ మన ప్రభుత్వం వంద రోజుల్లోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. తర్వాత పంచాయతీలోని టీడీపీ నేతలు శాలువా పూలమాలలతో ఎమ్మెల్యే పుట్టాను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంగమునిరెడ్డి, తహసీల్దారు దామోదర్‌రెడ్డి, డీఈ మధుసూదనరెడ్డి, సర్పంచ్ జ్యోత్స్నదేవి, హెచ్‌ఎం శ్రీను, మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ మాలేపాటి సుబ్బారావు, వెంకటేశ్ నాయుడు, ఓబయ్య, ప్రతాప్, సుధాకర్, వెంకటేశ్, మల్లయ్య, పుల్లారెడ్డి, సుబ్బరాయుడు, కాణాల మల్లికార్జునరెడ్డి, భూతప్పనాయుడు, ముడుమాల పోలిరెడ్డి, ఎస్‌ఆర్ శ్రీనివాసులరెడ్డి, వెల్లటూరు సాంబశివారెడ్డి, చిలమల నారాయణ, చిలమల నాగయ్య, మేకల సుధాకర్, రామచంద్రనాయుడు, సెక్రటరీ సురేశ్, అధికారులు పాల్గొన్నారు.

## తిరుమల పవిత్రతను కాపాడండి



ఎస్‌ఐ మద్దిలేటికి ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

మైదుకూరు రూరల్ ,సెప్టెంబరు 22 : తిరుమల లడ్డూలో వేసే నెయ్యిలో జంతు కొవ్వులను కలిపారు అనే విషయంపై ఆదివారం హిందూ ఐక్యవేదిక సభ్యులు తీవ్రంగా ఆగ్రహించి స్థానిక అంకాలమ్మ గుడి వద్ద నుంచి పోలీస్ స్టేషన్ వరకు భారీ ర్యాలీని నిర్వహించారు.దోషులను శిక్షించండి,తిరుమల పవిత్రతను కాపాడండి అంటూ చిన్న,పెద్దలు,మహిళలు నినాదాలు చేశారు.అనంతరం అచలానందస్వామి ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి మాట్లాడుతూ లడ్డూలో కొవ్వు పదార్థాలు కలపడం దారుణమని మండిపడ్డారు.ఈ కార్యక్రమానిక మైదుకూరు బీజేపీ ఇన్‌చార్జ్ మాచనూరు సుబ్బరాయుడు,పందిటి పెద్దయ్యయలవలి గోపి,మాధవి తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీపీఎఫ్ డబ్బులు ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయండి

జమ్మలమడుగు, సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2022 జనవరి జీతం బిల్లుల్లో తగ్గించిన జడ్పీపీఎఫ్ డబ్బులు ఇంతవరకు ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ కాలేదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కౌన్సిలర్ గురుకుమార్ తెలిపారు. ఆదివారం జమ్మలమడుగు పట్టణంలో ఎస్టీయూ రీజియన్ కార్యాలయంలో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జమ్మలమడుగు రీజియన్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు రంగేశ్వరరెడ్డి, నిస్సార్ అహ్మద్, రాష్ట్ర ఉపాధ్యాయ వాణి కమిటీ కన్వీనర్ కుండా భాస్కర్ పాల్గొన్నారు.

## కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక

బద్వేలు రూరల్, సెప్టెంబరు 22 : బద్వేలు కార్పెంటర్స్ అసోసియేషన్ నూతన కమిటీని కార్పెంటర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగసాని శివయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఆ సంఘ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడుగా షేక్ దావుద్‌వల్లి, ఉపాధ్యక్షులు మిరాన్‌షాహెబ్, వెంకటరాజేశ్, సెక్రటరీగా బొమ్మురాజు శ్రీనివాసులు, కోశాధికారిగా నాగిపోగు శౌరి, జాయింట్ సెక్రటరీగా ఖాదర్‌బాషా తదితరులను సభ్యులను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.పట్టణంలో కార్పెంటర్స్ పాల్గొన్నారు.

## నకిలీ నోట్లు వస్తున్నాయి జాగ్రత్త

మైదుకూరు రూరల్, సెప్టెంబరు 22: మైదుకూరులో ప్రస్తుతం రెండు వందల రూపాయల నకిలీ నోటు ప్రత్యక్షమైంది. స్థానిక బద్వేల్ రోడ్డులోని లక్ష్మీగణపతి మె డికల్స్ మరో టీ షాపులో ఒకే రోజు రెండు చోట్ల నకిలీ నోట్లు వచ్చాయి. రెండు వందల రూపాయల నోట్లు ఒరిజనల్ నోట్లను పోలి ఉండడంతో వ్యాపారులు కనుక్కోలేక పోయారు. నిశితంగా పరిశీలిస్తే తప్ప కనుక్కోలేని పరిస్థితి ఉందని వారు చెబుతున్నారు. ప్రస్తుతం ఇద్దరి వద్ద మాత్రమే బయటపడినట్లు చెబుతున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రొద్దుటూరు, సెప్టెంబరు 22: ప్రొద్దుటూరు పట్టణం రామేశ్వరం ఆర్టీపీపీ మార్గంలో షేక్ జాఫర్ అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడని ఒన్‌టౌన్ పోలీసులు తెలిపారు. ఆదివారం ఆర్టీపీపీ రోడ్డులో షేక్ జాఫర్ అనే వ్యక్తి కమలాపురం నుంచి గంజాయితెచ్చి విక్రయిస్తుండాడనే సమాచారం తో పోలీసులు అతన్ని అరెస్టు చేసి 1100 గ్రాముల బరువుగల 13 వేల విలువ చేసే గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వారు పేర్కొన్నారు. జాఫర్‌పై గంజాయి కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించారు.

**వసంతపేటలో 11 మంది పేకాటరాయుళ్లు అరెస్టు ..:** పట్టణంలోని వసంత పేట ఆణాబంకు సమీపంలో 11 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డట్లు ఒన్ టౌన్ పోలీసులు తెలిపారు. వీరి వద్దనుంచి దాదాపు 28 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

# కరివేపాకు రైతుకు దళారుల బెడద

● కిలో కరివేపాకు రూ.3 ● అమాంతంగా పడిపోయిన ధరలు ● ఎకరాకు ఖర్చు రూ.30 వేల నుంచి రూ.40 వేలు ●ఆదుకోవాలని రైతన్నల విజ్ఞప్తి

జమ్మలమడుగు, సెప్టెంబరు 22: జమ్మలమడుగు మండలంలో కరివేపాకు పంట అధికంగా సాగు చేస్తారు. ప్రస్తుతం ఖర్చు పెరగడంతో రైతులు పంటలు సాగు చేయాలన్నా ముఖం చాటేస్తున్నారు. అందులో ఖర్చు తక్కువ, శ్రమ తక్కువ, ఆదాయం వచ్చే పంటలపై రైతులు మొగ్గు చూపుతున్నారు. అయితే జమ్మలమడుగు మండలంలో ఎస్.ఉప్పలపాడు గ్రామంలో కరివేపాకు పంట సాగు అధికంగా చేస్తారు. అలాగే సమీప గ్రామాల్లో అక్కడక్కడ రైతులు కరివేపాకు పంట సాగుపై మొగ్గు చూపుతున్నారు. అయితే కరివేపాకు సాగు చేయడానికి ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు ఖర్చు అవుతుంది. అలాగే మందులు, కూలీల ఖర్చులు ఉంటాయి. ఏడాదికి కరివేపాకు నాలుగు కోతలు వస్తుంది.



సాగులో ఉన్న కరివేపాకు

**● కరివేపాకు రైతుకు దళారుల బెడద**

ఒకప్పుడు కరివేపాకు సాగు చేసిన రైతులు కోతకు వచ్చిన పంటను కూలీల ద్వారా కోత చేసి స్థానిక మార్కెట్లలోకి తరలించి వ్యాపారస్తులకు విక్రయించేవారు. పది సంవత్సరాల నుంచి వ్యాపారులే కరివేపాకు కోసం పోటీపడి వచ్చి తీసుకెళ్లేవారు. ఎస్.ఉప్పలపాడు గ్రామం బోదుపల్లె, గుండ్లకుంట తదితర పొలాల్లో సాగు చేసిన కరివేపాకును వ్యాపారులు రైతుల వద్ద కొనుగోలు చేసి హైదరాబాదు, తమిళనాడు, తదితర దూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అయితే ఏడాది నుంచి వ్యాపారులంతా కుమ్మక్కై కరివేపాకు కావడంతో తక్కువ ధరకు అడుగుతున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కరివేపాకు బయటి ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒకప్పుడు తమ గ్రామంలోనే కేజీ రూ.50లతో కొనుగోలు చేసిన కరివేపాకు ఇటీవల రోజు రోజుకు ధర తగ్గిపోయిందన్నారు. ప్రస్తుతం కిలో రూ.3లకు విక్రయిస్తామన్నా కొనేవారు కనిపించడం లేదు. దళారీ వ్యవస్థ, వ్యాపారులు అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. పంటను కాపాడుకోవడానికి రైతు ఎంతో కష్టపడి పంట సాగు చేస్తే చేతికొచ్చే సమయంలో ధర లేక ఇబ్బంది పడుతున్నట్లు వాపోయారు.

**● ప్రభుత్వం ఆదుకోవాలి**

కరివేపాకు రైతును ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆయుర్వేదంలో కరివేపాకుకు ప్రాధాన్యత ఉందని, ఆదిశగా ప్రభుత్వం హార్టికల్చర్ ద్వారా రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రస్తుతం పొలంలో కిలో రూ.3లకు కొనుగోలు చేసి బయట రూ.20 నుంచి రూ.30లకు, అంతకంటే మరికొన్ని చోట్ల ఎక్కువగా విక్రయిస్తున్నారు. గిట్టుబాటు ధరలు లేక కొందరు రైతులు అప్పుడప్పుడు పంటను కోత కోసి పారవేయడం జరుగుతోందని రైతులు తెలిపారు. ప్రభుత్వం జమ్మలమడుగు ప్రాంతంలో లేక ఎస్.ఉప్పలపాడు గ్రామంలోనే సుమారు 800 నుంచి వెయ్యి ఎకరాలు కరివేపాకు సాగు చేస్తున్నారని, అక్కడే ఒక పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కరివేపాకు ధర లేనప్పుడు ప్రభుత్వం కొనుగోలు చేసి రైతుకు గిట్టుబాటు కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం కరివేపాకు రైతును అన్ని విధాలా ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కరివేపాకు లోడు

## 40 ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కొండాపురం, సెప్టెంబరు 22 : మండలంలోని తాళ్లప్రొద్దుటూరు జడ్పీ హైస్కూల్‌లో ఆదివారం 40 ఏళ్ల తర్వాత 1983-84 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ఈ కార్యక్రమానికి ఆనాటి విద్యార్థులు హాజరై తమ మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. 40 సంవత్సరాల తర్వాత ఆప్యాయంగా పలకరించు కుంటూ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి గురువులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర

బద్వేలు, సెప్టెంబరు 22: వైసీపీ హయాంలో జరిగిన భూ కబ్జాలు , ప్రభుత్వ భూముల అన్యాక్రాంతం చాలా జరిగాయని,వాటిని స్వాధీనం చేసుకుని అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జేవీ భవనంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను పరిరక్షించాలంటూ అక్టోబర్ 1వ తేదిన బద్వేలులో సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సభకు రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రామక్రిష్ణ రానున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని కాశినాయన మండలం అక్కెంగుండ్ల నుంచి అట్లూరు వరకు వేలాది ఎకరాల భూములను బినామీ పేర్లతో పొంది కంచెలు వేసుకుని ఉన్నారని స్థానికేతరులు అక్రమంగా భూములు పొందుతున్నారన్నారు. సీపీఐ తలపెట్టే ఈ కార్యక్రమానికి పేదలు, గత ప్రభుత్వ హయాంలో ఇబ్బంది పడ్డ భూబాధితులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, మస్తాన్,రవికుమార్,ఇమ్మానుయేల్, పెంచలయ్య, విజయ మ్మ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### జనసేన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

పోరుమామిళ్ల, సెప్టెంబరు 22 :దళిత డాక్టరుపై చేయి చేసుకుని దుర్భాషలాడిన జనసేన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవలని అంబేడ్కర్ సేన ఆర్గనైజింగ్ కార్యదర్శి ముత్యా ల ప్రసాద్ డిమాండ్‌చేశారు. ఆదివారం పాత్రికేయులతో మాట్లాడుతూ కాకినాడ ఎమ్మెల్యే నానాజీ దళిత డాక్టరు ఉమామహేశ్వరును దుర్భాషలాడడం సహించరాని విషయమన్నారు. ముఖ్యమంత్రి స్పందించి విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

## ఘనంగా జ్యోతుల మహోత్సవం

మైలవరం, సెప్టెంబరు 22: తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవమైన చౌడేశ్వరి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు మండల పరిధిలోని వేపరాలలో ఆదివారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ఇంటి వద్ద నుంచి జ్యోతులను తలపై ఎత్తుకుని గ్రామ పుర వీధుల్లో నాట్యం చేస్తూ భక్తిశ్రద్ధలతో ఆదివారం ఉదయానికి చౌడేశ్వరి అమ్మవారి ఆలయానికి చేరుకుంటారు.గ్రామంలో 32 జ్యోతులను ఏర్పాటు చేసినట్లు భక్తులు తెలిపారు. టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి చౌడేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం గొడుగుల మహోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### వానలు కురవాలని గ్రామ దేవతలకు పూజలు

మైలవరం, సెప్టెంబరు 22: వానలు కురవాలి.. పంటలు పండాలని ఆయా గ్రామాల్లోని గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని రేగడిపల్లి గ్రామ సమీపాన ఉన్న కోనేరులో నుంచి పెద్దమ్మ అమ్మవారికి, బొడ్డురాయికి, నాగదేవతలకు 324 బిందెలతో నీళ్లు పోసి టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. కల్లుట్ల గ్రామంలో గంగమ్మ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం ఏర్పాటుచేశారు.

### వంద రోజులపాలనపై విస్తృత ప్రచారం

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 22: టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజులపాలనపై నందమూరి యువసేవా సమితి ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఆదివారం శ్రీనివాసానగర్‌లో కరపత్రాలు పంచి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను గురించి వివరించారు. టీడీపీ మైనార్టీ సెల్‌కార్యనిర్వాహక కార్యదర్శి టప్పా మహబూబ్‌బాష, నందమూరి యువసేవా సమితి ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, నాయకులు రహమతుల్లా, షేక్షావలి పాల్గొన్నారు.

## నేడు అభివృద్ధి ప్రణాళికపై సమీక్ష

రాజుపాలెం,సెప్టెంబరు 22 : అన్నిశాఖల ద్వారా అభివృద్ధి ప్రణాళిక తయారు చేసేందుకు సోమవారం మధ్యాహ్నం 3గంటలకు మండల పరిషత్ సభాభవనంలో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో షాకీర్ ఆలీఖాన్ తెలిపారు. స్వర్ణాంధ్ర, 2047లో భాగంగా మండల విజన్ ప్లాన్ తయారు చేస్తున్నట్లు తెలిపారు. మండల ప్రత్యేక అధికారిశ్రీకాంత్‌నాయక్ ఆధ్వర్యంలో ఈ సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, గ్రామ రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు హాజరుకావాలని ప్రకటనలో తెలిపారు.

## పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే పుట్టా

ఖాజీపేట, సెప్టెంబరు 22: వారం రోజుల క్రితం మృతి చెందిన రెండు బాధిత కుటుంబాలను మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పరామర్శించారు. ఆదివారం సాయంత్రం ఖాజీపేట అగ్రహారానికి చెందిన సీనియర్ పాత్రికేయుడు, టీడీపీ నాయకుడు బొంగు శ్రీనివాసులరెడ్డి మృతిచెందడాన్ని తెలుసుకున్న పుట్టా సుధాకర్‌యాదవ్ వారి కుటుంబాన్ని ఓదార్చారు. అనంతరం సరంఖాన్‌పేటకు చెందిన ఖాసీంపీరా కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మీరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## మైలవరం ఎస్‌ఐగా శ్యాంసుందర్‌రెడ్డి



మైలవరం, సెప్టెంబరు 22: మైలవరం నూతన ఎస్‌ఐగా శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. మైలవరం ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రెడ్డిసురేష్ నంద్యాల జిల్లాకు బదిలీ కావడంతో నూతన ఎస్‌ఐ కర్నూల్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్యాక్షన్ నిర్మూలనపై ప్రత్యేక దృష్టి పెడతామని, బాధితులు నేరుగా తనను కలిసి సమస్యలు తెలిపేందుకు అందుబాటులో ఉంటానని ఎస్‌ఐ తెలిపారు.



## బీజేపీ సభ్యత్వ నమోదు

ప్రొద్దుటూరు టౌన్, సెప్టెంబరు 22: బీజేపీ చేపట్టిన సభ్యత్వ నమోదుకు విశేష స్పందన లభించిందని ఆ పార్టీ నాయకుడు నరేష్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం 13వ వార్డులోని మనోజీరావు వీధి, శంకరరావు వీధి, శ్రీరాములపేటలో ఇంటింటికి తిరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, వంకధార నరేంద్రరావు, కుమారి, భూమిరెడ్డి భాస్కర్‌రెడ్డి, గురుప్రసాద్, రమణయ్య, చలపతి, పరమేశ్వర్, సుధాకర్‌రావు, గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### కరపత్రాలు ఆవిష్కరణ

పోరుమామిళ్ల, సెప్టెంబరు 22 :కామ్రేడ్ సీతారాం ఏచూరి సంస్మరణ కరపత్రాలను పోరుమామిళ్ల సీపీయం మండల కార్యదర్శి భైరవ ప్రసాద్ ఆవిష్కరించారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఆయన సీతారాం ఏచూరి సంస్మరణ సభ కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గౌసియాబేగం, బీబీ, చిన్నయ్య, రవి పాల్గొన్నారు.

### మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా శ్రీనివాసులరెడ్డి

మైదుకూరు ,సెప్టెంబరు 22 : ఏపీలో 23 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీలు జరిగినట్లుగా పురపాలకశాఖ సెక్రటరీ అనిల్ సింఘాల్ ఆదేశాలు జారీ చేశారు. ఆ బదిలీలలో భాగంగా మైదుకూరు మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా ఎం.శ్రీనివాసులరెడ్డి నియమించినట్లు తెలిసింది. కాగా శ్రీనివాసులరెడ్డి గతంలో అద్దంకిలో శానిటరీ అధికారిగా పనిచేశారు.గతంలో మైదుకూరు కమిషనర్‌గా జబ్బార్‌మియా పనిచేశారు.

## స్కూటరు ఢీ - వ్యక్తికి తీవ్ర గాయాలు

అట్లూరు, సెప్టెంబరు 22: రెడ్డిపల్లె వాసి సి.కేశవులు (58) అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద శనివారం రాత్రి నల్ల గుండ్లపల్లె కాలనీ వాసి కొండయ్య స్కూటరు వెనుక భాగాన కూర్చుని ఉండగా నల్లగొండ మధు స్కూటరు ఢీకొనడంతో కేశవులు తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొండయ్యకు స్వల్పంగా గాయాలైనట్లు ఎస్‌ఐ వి.రామక్రిష్ణ తెలిపారు. క్షతగాత్రులను కడప రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించినట్లు కేశవుల బంధువులు తెలిపారు. కేశవులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నట్లు కొడుకు తిరుపాలు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

**పోరుమామిళ్ల..:** మల్లకతవ వద్ద స్కూటరుపై వెళుతున్న పోరుమామిళ్లకు చెందిన మాలిక్‌బాషాను లారీ ఢీకొనడంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. ఆదివారం పోరుమామిళ్ల నుంచి మార్కాపురం వైపు వెళుతున్న మాలిక్‌బాషాను కొమరోలు నుంచి పోరుమామిళ్ల వస్తున్న లారీ ఢీకొనడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని మెరుగైన చికిత్స కోసం కడపకు తరలించారు. తండ్రి కరీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కొండారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రైతుసేవా కేంద్రాలకు చేరిన యూరియా



అట్లూరు, సెప్టెంబరు 22 : మండలంలోని రైతు సేవా కేంద్రాలకు 20 టన్నుల యూరియా ఆదివారం చేరినట్లు ఏవో రామక్రిష్ణ తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వ్యవసాయ పంటలకు యూరియా సద్వినియోగం చేసుకోవాలని ఆయన ప్రకటనలో తెలిపారు. యూరియా బస్తా విలువ రూ.270 చెల్లించాలన్నారు. రైతులు సాగు చేసిన పంటలను రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఈకేవైసీ తప్పనిసరిగా చేయించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కొండూరు విలేజీ అగ్రికల్చర్ అసిస్టెంటు రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.